

# ఆ రోజు సాయంత్రం...

- ఉషారాణి భాటియా

ఆ రోజు సాయంత్రం మళ్లీ తిరిగి వచ్చినట్లయింది. అదే గాలి. అదే పూపు. అదే నిశ్శబ్దత. అదే ఆలోచనలు. స్థలం మాత్రం వేరు. వయసు కూడా చాలా వసంతాలు ముందుకి వెళ్లిపోయింది. మనసు స్థిరంగా లేదు. కన్నీళ్లు, నవ్వులు, అపోహలు, వంచనలు, స్నేహాలు, నమ్మకాలు, ఆశ్చర్యాలు - ఇలా ఎన్నో అనుభవాల్ని చవి చూసిన రవి మనసు గాలి పటంలా అల్లల్లాడుతోంది. అయోమయస్థితిలో వుంది.

ఎదురుగా కూర్చున్న రమణకి ఇవేమీ తెలియవు. చాలా కాలం తరువాత స్నేహితుణ్ణి కలుసుకున్న సంతోషంలో ఆపకుండా ఎన్నో విషయాలు నెమరు వేసుకుంటున్నాడు. తను నవ్వుతున్నాడు. రవిని నవ్వించ ప్రయత్నిస్తున్నాడు. తను కాలేజ్ వదిలినప్పటినుంచీ - ఉద్యోగాన్వేషణ, భార్యాన్వేషణ, సంసారం, పిల్లలు ఇలా అనర్గళంగా సాగిపోతోంది కథనం.

అతను కాస్త ఆగి, ఊపిరి తీసుకున్నాడు. జేబులోంచి ప్యాకెట్టు తీసి, రవికి సిగరెట్ అందించాడు. అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ,

"ఏమిటలా వున్నావు? ఏదో ఆలోచనలో పడ్డావు"? అనడిగాడు.

"ఆ! ఏం లేదు! ఇలా మనం కలుసుకోవటం ఎంత ఆశ్చర్యంగా, సంతోషంగా వుంది!" అంటూ రవి అగ్గిపెట్టె కోసం చేయిచాచాడు.

"మరేం! చాలా చిత్రంగా వుంది కదరా! సరోజకి విషయం. చెబితే నమ్మదు" అన్నాడు రమణ.

ఎవరన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు రవి. "నా భార్య... అదే నీ ఒదిన.... పిల్లల్ని తీసుకుని బజారు కెళ్లింది. ఇప్పుడే వచ్చేస్తుంది" అన్నాడు.

రమణ కుర్చీలో ముందుకి ఒంగి రహస్యం చెబుతున్నట్లు ఇలా అన్నాడు.

"నా అనుభవాన్ని బట్టి ఒకటి తెలుసుకున్నాను. అందం, డబ్బు, హోదా - ఇవొక్కటే కావు సుఖం ఇచ్చేవి. సామాన్య కుటుంబంలో పుట్టి, చూసేందుకు మామూలుగా వుండి, కొద్దిపాటి చదువు, సంస్కారం గల సరోజ నాతో తృప్తిగా, సంతోషంగా జీవిస్తుంది. ఎంతో అనుకూలవతి అయిన భార్య....."

రవి ఓ క్షణం మౌనంగా వుండిపోయాడు. స్నేహితుని అంతరంగిక విషయాలు ఏమని ప్రశ్నించగలడు? కానీ అతని మాటలకి అడ్డుపడకుండా, ప్రోత్సహిస్తూ,

"ఊ! అదృష్టవంతుడివి!" అన్నాడు.

రమణ ముఖం సంతోషంతో విప్పారింది. రవిని ఉద్దేశించి కాక, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు, చెప్పుకుపోయాడు.

"ఎప్పుడూ నవ్వుతూ వుంటుంది. కుటుంబంలో సమస్య లెదురైనప్పుడు ధైర్యంగా వుంటుంది. సానుభూతి, సహాయం అందిస్తుంది. పెద్దగా సలహాలివ్వదు. కానీ ఆమెలో వుండే కరుణ, నా సుఖంలో ఆమెకి వున్న ఆసక్తి చాలు నాకు. నేను సంపాయించే నాలుగు రాళ్లు గౌరవంతో, తృప్తిగా అందుకుని, పొదుపుగా ఖర్చు పెడుతుంది.

రమణ ఆగాడు. "అదిగో సరోజ, వస్తూంది!" అంటూ గేటువైపు చూశాడు. అతని ముఖంలో తలుక్కున మెరిసిన కాంతి, ఆనందం చూసి రవి ఆశ్చర్య చకితుడయ్యాడు. మెడ తిప్పి దూరంగా వస్తున్న ఆమెని చూశాడు. కొంచెం లావయింది. కానీ అదే నడక. ముఖం తీరు. ఆమెని గుర్తు పట్టటంలో రవి పొరబడలేదు. ఆమె ఆ సరోజే..... అతని మనసు పదేళ్లు వెనక్కి మళ్లింది. జ్ఞాపకాలు చిందరవందరయి, మళ్లీ ఒక చోట పోగు అయి, రవిని గతంలోకి తీసుకువెళ్లాయి. కానీ ఆమె అతన్ని గుర్తు పట్టినట్లు లేదు. రమణ భార్యని స్నేహితుడికి పరిచయం చేశాడు. ఆమె కాఫీ, ఫలహారాలు తీసుకువస్తానంటూ లోపలికి వెళ్లింది. రమణ తన పిల్లల్ని చూపించి ఏదో చెబుతున్నాడు. కానీ రవి ఏమీ వినిపించుకోవటం లేదు. పూల వాయిలు చీర, మెళ్లో పసుపు తాడు పక్కన సన్నని గొలుసు, చేతికి రబ్బరు గాజులు- స్టీలు పళ్లెం, కారుప్పూస, కాఫీ కప్పులు - సరోజవంక చూస్తున్నాడు.

ఆమె కుర్చీలాక్కుని అతని ఎదురుగా కూర్చుంది. నవ్వు ముఖంతో అతనికి పళ్లెం అందించింది. తనని సరోజ గుర్తు పట్టలేదు... రవి అహం దెబ్బ తింది!

*******

ఆ రోజు సాయంత్రం కూడా సరిగ్గా ఇలాగే జరిగింది. స్టీలు పళ్లెంలో కారప్పూస, బిస్కత్తులు, కాఫీ కప్పులతో సరోజ రవికి ఎదురుగా వచ్చి కూర్చుంది. అతని వంక చురుకుగా చూసింది. నీలం పువ్వుల వాయిలు చీర కట్టుకుంది. సన్నగా వుంది. వదులుగా జడ, మెడలో సన్నని బంగారం గొలుసు, చేతికి రబ్బరు గాజులు, చామనచాయ రంగు. మామూలుగా వుంది చూసేందుకు. రవి ఆమెని చూడవలసినంత పరిశీలనగా చూడలేదు. చుట్టూతా జనం! పెళ్లి చూపులు కద! రవి పక్కనే కూర్చున్న మామ కొడుకు రఘు మోచేత్తో తనని పొడిచాడు. కళ్లతో తన అసంతృప్తిని తెలిపాడు. రవికి తగని మొహమాటం. అమ్మాయితో విడిగా మాట్లాడవచ్చేమో అడగమని మధ్య వర్తిని కోరాడు. అతను లేచి వెళ్లి, సరోజ తల్లి తండ్రులతో ఏదో గుసగుసలాడి, తిరిగి వచ్చాడు. 'పక్కవరండాలోకి రండి' అని రవినీ, రఘునీ లేవదీశాడు.

వరండాలో రెండు చెక్క కుర్చీలు వున్నాయి. సరోజని వాళ్లమ్మ అక్కడికి తీసుకువచ్చి కూర్చోబెట్టి, తాను దూరంగా నిలబడింది.

అప్పటికి సరోజకి కొంచెం ధైర్యం వచ్చినట్లుంది. తలెత్తి రవివంక చూసింది. ఆమె చూపులు అమాయకంగా వున్నాయి. చురుగ్గా, సూదుల్లా రవిని అకట్టుకోలేదు. కానీ ఆ ఇంటర్వ్యూ ఆమెకిది మొదటిది కాదని వ్యక్తం చేసే ఒక వర్ణించలేని ఆవేదన కనపడుతోంది ఆమె కళ్లల్లో. సంభాషణ ఇలా నడిచింది.

"ఎంతవరకు చదువుకున్నారు?"

"బి.ఏ."

"మీడియమ్ ?"

"తెలుగు - ఇంగ్లీషు రెండూ"

"హాబీలు?"

"తెలుగు పుస్తకాలు చదవటం. హిందీ, తెలుగు సినిమాలు చూడటం..."

"హిందీ వచ్చా?"

"కొద్దిగా అర్థమవుతుంది"

"తెలుగులో ఎవరి పుస్తకాలు చదివారు?"

"మాలతీచందూర్ రచనలు ఇష్టం."

"ఇంగ్లీషు పుస్తకాలు చదవరా?"

"అవకాశం దొరకలేదు"

సంభాషణ ఉన్నట్లుండి ఆగిపోయింది. వెనక నిలుచున్న సరోజ తల్లి అందుకుంది.

"అమ్మాయికి వంటా, వార్పూ బాగా వచ్చు. అల్లిక పనులు కూడా వచ్చును."

"మీరు నన్నేమీ అడగరా?"

ప్రశ్నించాడు రవి సరోజ నుద్దేశించి.

లేదన్నట్లు ఆమె తల అడ్డంగా తిప్పింది. రవి ఆమెతో మాట్లాడిన ఆఖరి వాక్యం అదే.

ఇల్లు చేరేంతవరకూ దారిలో రవి నోరు విప్ప లేదు. గుమ్మంలో అడుగు పెడుతూనే తల్లి అడిగింది.

"పిల్ల ఎలావుందిరా?"

రవి మౌనంగా లోపలికి వెళ్లిపోయాడు. తల్లి అతని వెనకాలే గదిలోకి వెళ్లింది.

"చెప్పరా ఎలా వుంది?"

కాస్సేపు ఆగి మళ్లీ అందుకుంది.

"కన్ను లొట్టా, కాళ్లు వంకరా?.... ఇలా అందర్నీ వద్దంటూ పోతే ఆజన్మ బ్రహ్మచారి వయిపోతావు?" తల్లి గొంతులో కోపం, దుఃఖం రెండూ మిళితమ య్యాయి. రవి ఆమె ముఖంలోకి చూడలేక పోయాడు.

"వద్దని అనలేదు. ఆలోచించుకోనీ......" అంటూ గొణిగాడు.

ఇంతలో రఘువచ్చి తల్లీ కొడుకు లిద్దరి మధ్య నిలబడ్డాడు.

"బాగాలేదు. అత్తయ్యా! వాణ్ణి వేధించుకు! ఏ పిల్లా నచ్చలేదంటే అది వాడి తప్పు కాదు. మన దురదృష్టంకొద్దీ మనం అలాంటి పిల్లల్ని చూసేందుకు వెళుతున్నాం, అంతే." అన్నాడు మెల్లిగా రఘు.

"అవును. ఇది కూడా నిజమే. మన దురదృష్టం! ఇంతకీ పిల్లకేమయింది?" అడిగింది తల్లి.

"పెద్ద చదువూ, అందమూ రెండూ లేవు. మన వాడి తెలివితేటలు, అభిరుచులు - వీటితో పొంకం లేదు. అబ్బే! మరచిపో ఈ సంబంధం."

రవి వంక చూసి కనుసంజ్ఞ చేశాడతను. తల్లి లోపలికి వెళ్లిపోయింది. రవికి మనసులో ఏదో ఇబ్బందిగా వుంది. పక్కకి తిరిగి, బల్ల మీద పుస్త కాలు సర్దటం ప్రారంభించాడు. రఘు దగ్గిరగా వచ్చి అతని భుజం మీద చేయి వేశాడు.

"నీకు నచ్చిందా?"

"ఏం తెలియటం లేదు."

"అంటే?......"

పాపం ఆ పిల్ల ఏమనుకుంటుందో?..." ఇలా వెళ్లటం, చూసి నిరాకరించడం... ఏదో అన్యాయంగా, ఘోరంగా వుంది?..." అన్నాడు రవి.

"అయితే వెళ్లి వెంటనే ఒప్పేసుకురా" రఘుకి కోపం వచ్చింది.

"అది కాదురా. పోనీ మళ్లీ ఒకసారి ఆమెని కలుసుకుంటే?.... వాళ్ల వాళ్లు ఒప్పుకుంటారా?" రవి అడిగాడు.

"ఏమో నాకు తెలీదు. ఈ విషయం గురించి ఆలోచించటం కాస్సేపు మానెయ్. రా అలా బీచి వైపుకి వెళదాం."

అంటూ రఘు, రవిని బైటికి తీసుకు వెళ్లాడు.

బీచి జనంతో రద్దీగా వుంది. చల్లటి గాలి వీస్తున్నా, హాయిగా లేదు. వాళ్లిద్దరూ దూరంగా, అలలకి దగ్గిరగా, తడి ఇసుకలో కాళ్లు చాపుకుని కూర్చున్నారు. సూర్యాస్తమయి, అప్పుడే దీపాలు వెలిగాయి నాలుగువైపులా.

"చూడు రవీ! నీ కిప్పుడేం వయసు మించి పోయింది. బ్యాంకులో మంచి ఉద్యోగస్థుడివి. చదువుకున్నవాడివి. సంస్కారం గల కుటుంబంలో పుట్టావు. నీలాగా యోచించగల వాళ్లు, నీకున్నలాటి జీవితపు విలువలు, అభిరుచులు గల వాళ్లెంతమంది అంటావు?" రఘు కంఠం హెచ్చుస్థాయినందుకుంది.

"నన్ను గురించి నేను అలా అనుకోవటం లేదు, " రవి మెల్లిగా అన్నాడు.

"ఎందుకనుకోకూడదు నిజం ఎంతయినా నిజమే కదా! పెళ్లి అనేసరికి - నీ అభిరుచులకి, ఆలోచనలకి అనువైన పిల్లని ఏరుకోవాలి. కానీ అలాటి మామూలు పిల్లని చేసుకుంటే నిరాశతో కృంగిపోతావు." రఘు నచ్చ జెబుతున్నాడు.

"మామూలు అంటే నీ అర్థం?...."

రవి తల పైకెత్తాడు.

"ఆమె మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, పెరిగింది. ఇంగ్లీషు సాహిత్యం, ఉన్నతాభిరుచులు పరిచయం లేని మామూలు వాతావరణం ఆమెది. నీతో సమంగా జీవించ లేదు. ఆమెకి తగ్గ సామా న్యుడు ఆమెకి సులభంగా దొరుకుతాడు - ఏదో గుమాస్తా గిరీ చేసుకుంటూ, తెలుగు సినిమాలు చూసుకుంటూ, చిన్న రకం ఆలోచనలు, అభి రుచులు గల సామాన్యుడు. అటువంటి సామాన్యు డితోనే ఆమె హాయిగా బ్రతగ్గలదు. నువ్వు ఆకోవకి చెందినవాడివి కావు. నీ తెలివి, వాతావరణం, ఆశయాల తీరు వేరు. నీ కెందుకు ఆమెని గురించి బెంగ?"

రఘు మాటలు రవికి బాగానే అనిపించాయి. నీళ్ల వంక నుంచి దృష్టి మరల్చి అతను తల పైకెత్తి చూశాడు.

"నీకేం తక్కువ? నీలాటి వాడికి బాగా చదువు కుని, అందం, తెలివి తేటల్లో నీకు సరితూగే మంచి పిల్ల దొరక్కపోదు. కొంచెం ఓపిగ్గా వెతకాలి. అంతే. ఇలా తొందరపడి నిర్ణయాలు తీసుకో కూడదు."

రఘు ధైర్యంగా గొంతెత్తి రవి బుజాల్ని వూపుతూ అన్నాడు.

"అత్తయ్యకి నేను నచ్చ చెబుతాను. మామూలు మనుష్యుల కోసం ఇక వెతకం. నీకు ఎలాటి పిల్ల కావాలో అలాటి వాళ్లనే వెళ్లి చూద్దాం. పోదాం పద. కమాన్! బి బ్రేవ్! " అంటూ రఘు, రవిని లేవ దీశాడు.

వాళ్లు ఇల్లు చేరేటప్పటికి రాత్రి తొమ్మిదయింది. రవికి ఆ రాత్రి బాగా నిద్ర పట్టింది. రఘు మాటలు అతన్ని బాగా ప్రభావితం చేశాయి. మర్నాటి ఉద యమే సరోజ ఇంటికి కబురు వెళ్లిపోయింది.

******

ఆ సాయంత్రం, రవి దగ్గిర శలవు తీసుకుంది. నాలుగువైపులా దీపాలు వెలిగాయి. చేతి గడియారం చూసుకుంటూ ఇక వెళతానని రమణకి సైగ చేసి లేవబోయాడు రవి.

"అప్పుడేనా?...." రమణ బలవంతం చేశాడు. సరోజ అతని కప్పులో మరింత కాఫీ పోసింది.

"మీరు ఏం ముట్టుకోలేదు. కాఫీ అయినా తాగండి" అంది మెల్లిగా. రవి ఆమె ముఖంలోకి సూటిగా చూడలేక చేయి అడ్డం పెడుతూ, 'చాలు. చాలు' అన్నాడు. ఆమె లోపలికి వెళ్లిపోయింది.

రమణ ముందుకివంగి, నవ్వుతూ

"ఇంతకీ ఇల్లూ, సంసారం వుందా? ఇంకా బ్రహ్మచర్యమేనా?" అనడిగాడు.

రవి లోలోపల నవ్వుకున్నాడు.

"ఉంది. ఒక కూతురు" అన్నాడు.

"అబ్బ! ఇంత సేపటికి మంచి వార్త చెప్పావు! ఒదిన గారు ఎక్కడ? తీసుకురాలేదేం?" అడిగాడు.

"ఆమె సాఫ్ట్ వేరు ఇంజనీరుగా కాలిఫోర్నియాలో వుద్యోగం చేస్తూంది. అమ్మాయి అక్కడే చదువు కుంటోంది." అన్నాడు.

"అయితే నువ్విప్పుడు అమెరికా నుంచి రావ టమన్నమాట..." అన్నాడు.

"అంతే అనుకో...." గొణిగాడు రవి.

"ఇంకా వుంటావా? ఇదిగో సరోజా..."అంటూ రమణ భార్యని పిలవబోయాడు.

"ఇక వుంటాను. ఆమె పనిలో వుంది. పిలవ వద్దు. మళ్లీ వస్తాను." అంటూ రవి లేచి గబగబ గేటువైపుకి నడిచాడు. వీధిలోకి మళ్లుతూ వెనక్కి తిరిగి చూశాడు.

రమణ పిలుపు విని సరోజ బైటికి వచ్చింది. ఇద్దరూ వరండాలో నిలుచుని రవి వంక ఆప్యా యంగా చూస్తూ, చేతులూపుతున్నారు. కిటికీలోంచి పిల్లలిద్దరూ రవిని కుతూహలంతో చూస్తున్నారు.

"మామూలు మనుషులు!" రఘు ఎక్కడో దూరంగా అంటున్నాడు. అలా దూర దూరంగానే, ఎంతో దూరంగా వున్న మామూలు మనిషి కాని రవి భార్య - రేవతి - తెలివి తేటల్లో, సంస్కారంలో, హోదాలో - రవితో సరితూగే భార్య - మామూలు మనిషికాని రవిని గురించి ఆలోచిస్తోందా?.... సమాధానం దొరకని ప్రశ్న అది. ఎన్నాళ్లనుంచో రవిని పట్టి పీడిస్తున్న ప్రశ్న అది. ఆ ప్రశ్న మనసులో మెదలగానే ఎంతో ఒంటరితనం అలముకుంది రవి మనసులో. భారంగా అడుగు లేసుకుంటూ అతను వీధిలోకి వచ్చి టాక్సీ ఎక్కాడు.

(ఆఖరి వీడ్కోలు'లో స్వప్నతో పురుషోత్తం)

'కుల విభజన నువ్వు రూపుమాపదలచుకొన్నా ఆర్థికంగా, అంతస్తుపరంగా మనుషుల మధ్య విభజన ఎప్పుడూ వుండనే వుంటుంది. ఎన్ని ఉపన్యాసాలు దంచినా, ఎన్ని ఉద్యమాలు లేవదీసినా ఈ హెచ్చుతగ్గులు ఎవరూ రూపుమాపలేరు' - పొల్కంపల్లి శాంతాదేవి